

# గుండెపోటుతో ప్రయివేటు స్కూలు బస్ డ్రైవర్ మృతి

### విధి నిర్వహణలో ఉండగా ఘటన

### తాను చనిపోతూ 25 మంది విద్యార్థులను కాపాడిన వైనం..

**ప్రజాశక్తి తాడిపత్రి రూరల్**

ప్రమాదాలు ఏ సమయంలో ఎటువైపు నుంచి జరుగుతాయో ఎవరు ఊహించలేరు. ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. బస్సు నడుపుతూ గుండెపోటుతో డ్రైవర్లు చనిపోతున్న ఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. ఇలాంటి సంఘటననే తాడిపత్రి రూరల్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. తాను గుండెపోటుకు గురైనా విద్యార్థులకు ఎలాంటి ఆపద జరగకూడదన్న భావనతో వారిని సురక్షితంగా ఉంచాడు.

స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. రూరల్ పరిధిలోని ఆటోనగర్ సమీపంలో పుట్లూరు రోడ్డులో వైష్ణవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉంది. ఆ స్కూల్ కి చెందిన బస్సుకు తాడిపత్రి మండలం కావేటి సముద్రం గ్రామానికి చెందిన రవిశంకర్ రెడ్డి ( 45) గత కొంతకాలంగా డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. తన విధుల్లో భాగంగా స్కూల్ పిల్లలను చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పాఠశాలకు బస్సులో తీసుకువచ్చి వదిలేవాడు. ఈనేపథ్యంలో రోజువారి పనిలో భాగంగా గురువారం ఉదయం స్కూల్ పిల్లలను బస్సులో తీసుకుని రవిశంకర్‌రెడ్డి వస్తున్నాడు. బస్సు పుట్లూరు రోడ్డు రైల్వే గేటు సమీపంలోకి రాగానే రవిశంకర్ రెడ్డికి గుండెనొప్పికి గురయ్యాడు. తాను అస్వస్థతకు గురయ్యానన్న సంగతి గ్రహించిన డ్రైవర్ రవిశంకర్‌రెడ్డి వెంటనే అప్రమత్తమయ్యాడు. బస్సును రోడ్డు పక్కన ఆపి అలాగే స్టీరింగ్‌పై వాలిపోయాడు. గమనించిన విద్యార్థులు డ్రైవర్ వద్దకు వెళ్లి తట్టిలేపే ప్రయత్నం చేశారు. అయితే అతనిలో చలనం లేకపోవటంతో పాఠశాల యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. చుట్టుపక్కల వారు వచ్చి పరిశీలించి రవిశంకర్‌రెడ్డి మృతిచెందాడని నిర్ధారణకు వచ్చారు. తన ప్రాణం పోతుందని తెలిసి చాకచక్యం గా బస్సును ఆపి విద్యార్థుల ప్రాణాలను కాపాడిన రవిశంకర్‌రెడ్డి వ్యక్తిత్వం ఎంతో గొప్పదని వ్యాఖ్యానించారు. మృతుడు రవిశంకర్‌రెడ్డికి భార్య గాయత్రి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.



# గుంతకల్లుకు 'గుమ్మనూరు'

### నేడో, రేపో టిడిపిలో చేరే అవకాశం

### తనతోపాటు పార్టీలో చేరాలని అనుయాయులకు సంకేతం

### రసవత్తరంగా రాయలసీమ రాజకీయం

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

కార్మిక శాఖ మంత్రిగానున్న గుమ్మనూరు జయరాం వైసిపిని వీడేందుకు సిద్ధమైనట్లు ప్రచారం నడుస్తోంది. ఈ మేరకు ఆయన ఒకటి, రెండు రోజుల్లో టిడిపిలో చేరుతారన్న ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ఈ మేరకు ఆయన తన అనునూయులతోనూ ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు సమాచారం. తన అనుయాయులు కూడా పార్టీలో చేరాలని ఆయన ఈసందర్భంగా సూచించినట్లు తెలుస్తోంది. కార్మిక శాఖ మంత్రిగానున్న గుమ్మనూరు జయరామ్‌కు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గం కాకుండా కర్నూలు పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేయాలని అధిష్టానం నిర్ణయించింది. ఈ మేరకు పేరును ఖరారు చేసి ప్రకటించింది. అయితే ఆయన పార్లమెంటుకు కాకుండా అసెంబ్లీ నియోజకవర్గానికే పోటీ చేయాలన్న ఆలోచనతోనున్నారు. ఇక వైసిపిలో ఆ అవకాశం దక్కే సూచనల్లేవన్న ఉద్దేశ్యంతో పార్టీ మారి అసెంబ్లీకి పోటీ చేయాలన్న యోచనలోనున్నట్టు తెలుస్తోంది. అయితే ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి టిడిపి అభ్యర్థి మరొకరు ఉండటంతో ఆ నియోజకవర్గం పకకనే ఉన్న అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం వైపు దృష్టి సారించినట్టు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. బోయ సామాజిక తరగతి అధికంగానున్న ఈ నియోజకవర్గంలో ఆయన్ను దింపడం ద్వారా కొంత ప్రయోజనముండే అవకాశముందని టిడిపి అధిష్టానం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఆయన చేరికకు మార్గం పూర్తి స్థాయిలో సుగమమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు పార్టీ కోసం పనిచేస్తూ వచ్చిన గుంతకల్లు టిడిపి నాయకులు తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే జితేందర్ గౌడ్ కుటుంబానికి ముందు నుంచి నియోజకవర్గంలో మంచి పట్టుంది. ఆయన సోదరుడు సాయినాథ్‌గౌడ్ హయాం నుంచి ఆ కుటుంబం ఎమ్మెల్యేగా ఉంటూ వచ్చింది. మధ్యలో మార్పులు జరిగినా 2014 ఎన్నికల్లోనూ జితేందర్‌గౌడ్‌కు పార్టీ టిక్కెట్టు ఇచ్చింది. ఆయన విజయం సాధించారు. 2019లోనూ ఆయనకే ఇచ్చింది. అయితే ఓటమి చెందారు. అప్పటి నుంచి కూడా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగాఉంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇక జీవానందరెడ్డి వైసిపి నుంచి వచ్చి టిడిపిలో చేరారు. ఆయన కూడా టిక్కెట్టు ఆశిస్తున్న వారి జాబితాలోనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇప్పుడు పాతవారికి కాదని ఇతర పార్టీ నుంచి వచ్చి చేరిన వెంటనే, అది కూడా పక్క జిల్లా వ్యక్తికి టిక్కెట్టు ఖరారు చేసే ఆలోచన సరైంది కాదని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జయరాం స్థానికేతరుడన్న అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. అయితే జయరాం పార్టీలో చేరి గుంతకల్లు అభ్యర్థి అయితే ఏ మేరకు పార్టీ నేతల నుంచి సహకారముంటుందన్నది చర్చ నడుస్తోంది. జయరాంకు జిల్లాలోని కొంత మంది నేతలతోనూ ముందు నుంచి సంబంధాలున్నాయి. ఆ సంబంధాలతోనే ఆయన టిడిపి వైపు మొగ్గు చూపారన్న చర్చ నడుస్తోంది. ఆయన సామాజికవర్గం అధికంగా ఉండటంతో అది కూడా కలిసొస్తుందని భావిస్తున్నారు. ఏది ఏమైనా గుంతకల్లు అసెంబ్లీ రాజకీయాలు కూడా రసవత్తరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైసిపి కూడా ఇంకా ఆ స్థానంలో అభ్యర్థులను ఖరారు చేయలేదు. సిట్టింగు ఎమ్మెల్యేగానున్న వై.వెంకటరామిరెడ్డి మాత్రం తనకే ఈసారి కూడా టిక్కెట్టు అని చెబుతున్నప్పటికీ ఎలాంటి మార్పులు అక్కడా జరగనున్నాయన్నది చూడాల్సుంది.

# ప్రధాన రహదారికి అడ్డంగా చెట్టు

### పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

మండలంలోని శ్రీనివాస్ క్యాంపు వద్ద కణేకల్-బళ్లారి ప్రధాన రహదారిపై వేపచెట్టు విరిగిపడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెట్టు విరిగి పడినట్లు ఆర్అండ్‌బి, రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. రహదారికి అడ్డంగా చెట్టు కొమ్మ ఉండటంతో ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు ఎక్కడ ప్రమాదం జరుగుతుందో.. వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏ ప్రమాదం జరగకముందే రహదారికి అడ్డంగా పడిన చెట్టు కొమ్మను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు



ధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

# కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

### డిసిఎల్ కార్యాలయం ఎదుట ధర్నాలో సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

భవన నిర్మాణ రంగ కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఏర్పాటు చేసి సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వై.వెంకటనారాయణ, సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజా డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు జిల్లా కార్మిక సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ రంగ సంక్షేమ బోర్డును వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. కార్మికులకు అందాల్సిన నిధులను దారి మళ్లించిందన్నారు. గత ప్రభుత్వాలు కూడా కార్మిక సంక్షేమ బోర్డు నిధులు దుర్వినియోగం చేశాయని గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణమే 12,14 జీవోలను రద్దు చేసి సంక్షేమ బోర్డును పని చేయించి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో 23 లక్షలకు పైగా భవన నిర్మాణ కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. 2007 నుంచి వెల్ఫేర్ బోర్డు ద్వారా రకరకాల సంక్షేమ పథకాలు భవన నిర్మాణ కార్మికులకు అమలయ్యాయని అన్నారు. ప్రభుత్వాలు అక్రమంగా వాడుకున్న నిధులను తక్షణమే బోర్డుకు జమ చేయాలన్నారు. అనంతరం డిసిఎల్ లక్ష్మినరసయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి సురేంద్ర, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఎర్రిస్వామి రెడ్డి, కార్యదర్శి వీరయ్య, కోశాధికారి షేక్ జిలాన్, సిఐటియు నగర కమిటీ సభ్యులు ఆది, ఇర్ఫాన్, ఆజాంబాషా తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయులపై దాడి దుర్మార్గం

### కలెక్టరేట్ వద్ద నిరసనలో రాజకీయ, ఉద్యోగ, ప్రజా కార్మిక, జర్నలిస్టు సంఘాలు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

రాష్ట్రంలో పాత్రికేయులపై జరుగుతున్న దాడులు దుర్మార్గమని రాజకీయ, ఉద్యోగ, ప్రజాకార్మిక, జర్నలిస్టు సంఘాల నాయకులు విమర్శించారు. పాత్రికేయులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ రాజకీయ, ఉద్యోగ, ప్రజాకార్మిక, జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. ఎపి డబ్ల్యూజె ఆధ్వర్యంలో చలో అనంతపురం కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్ట్ శ్రీ క్రిష్ణపై దాడి, హత్యాయత్నం, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడి, రాష్ట్రంలో పలు చోట్ల పాత్రికేయులపై జరిగిన దాడులను ఖండిస్తూ చలో అనంతపురం కార్యక్రమం నిర్వహించారు. రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పాత్రికేయులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి రాష్ట్ర ప్రభుత్వ, వైసిపి నాయకుల వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎపిడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐవి.సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాత్రికేయుల ధర్నాకు టిడిపి, జనసేన, సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, విద్యార్థి సంఘాల నేతలు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఐవి.సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పాత్రికేయులపై దాడుల సంస్కృతికి వైసిపి ప్రభుత్వం



కలెక్టరేట్ ఎదుట జరిగిన నిరసనలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప

తెరలేపిందన్నారు. స్వార్థ రాజకీయాల కోసం పాత్రికేయులపై దాడులు హేయమైన చర్య అన్నారు. ప్రజల పక్షాన నిస్వార్థంగా సేవలు అందిస్తున్న పాత్రికేయుల పట్ల ఇలాంటి దాడులు సరికావన్నారు. వైసిపికి ఛానల్, పత్రిక ఉందన్న విషయాన్ని అధికార పార్టీ నేతలు మరచినట్లు ఉన్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సాక్షి మీడియా పాత్రికేయులపై దాడులు జరిగితే నాడు కూడా పాత్రికేయులుగా ఖండించామన్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తించుకోవాలన్నారు. దాడులు చేసుకుంటూ పోతే ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్రజాస్వామ్యానికి వాటిల్లే ముప్పును తెలియజేస్తూ పాలకుల వైఖరి మార్చి రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి లోబడి పరిపాలించేలా వార్త కథనాలు ప్రచురిస్తూ మేల్కొలుపులా పాత్రికేయులు తమ వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తుంటారన్నారు. ఆ క్రమంలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే వ్యతిరేకించే పద్ధతులు అనేకం ఉన్నాయని చెప్పారు. ఇప్పటికైనా పాత్రికేయులపై దాడుల సంస్కృతికి స్వస్తి చెప్పాలన్నారు. పోరాటాలు చేయించడం, చేయడం తమకూ తెలుసని ప్రభుత్వం గుర్తించుకోవాలన్నారు. అంతకు ముందు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప, మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూర్యనారాయణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుల టిసి.వరుణ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, జనసేన రాయలసీమ కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, మాజీ జెడ్పీటీసీ వేణుగోపాల్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసి చైర్మన్ సాకే హరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దేవళ్లమురళి, ఏపిడబ్ల్యూజె జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్, ఫోటో జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు డానియల్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం రాష్ట్ర నాయకులు రసూల్, కెపి.కుమార్, జిల్లా అధ్యక్షులు జగదీష్, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఓతురు పరమేష్, కుల్లాయిస్వామి, వివిధ పాత్రికేయ సంఘాల నాయకులు, వందలాది మంది పాత్రికేయులు పాల్గొన్నారు.

# రైతుల ఉద్యమంపై కేంద్రం నిరంకుశత్వాన్ని ఖండిద్దాం

### ఆందోళనలో రైతు సంఘం నాయకులు




ఆందోళనలో పాల్గొన్న రైతుసంఘం, సిఐటియు నాయకులు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

దేశవ్యాప్తంగా రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో చేపడుతున్న రైతు ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాన్ని ప్రజాస్వామ్య వాదులు, రైతు శ్రేయోభిలాషులు ఖండించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అన్నారు. ఢిల్లీలో రైతు ఉద్యమం నేపథ్యంలో పోలీసుల దాడుల్లో రైతు శుభకరణ్‌సింగ్ మృతిచెందడంపై రైతు సంఘం ఆధ్వర్యంలో అనంతపురం టవర్‌క్లాక్ సర్కిల్‌లో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమంపై పోలీసులచే దాడి చేయించి రైతు శుభ్ కరణ్ సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం బలితీసుకుందన్నారు. రైతులు గతంలో చేపట్టిన ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులు పండించే అన్ని పంటలకు డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ సిఫార్సుల మేరకు మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని రైతులు ఉద్యమించారన్నారు. ఒక పర్యాయం పంటరుణాలను మాఫీ చేసి ఆత్మహత్యల నుంచి రైతాంగాన్ని కాపాడాలని, పార్లమెంట్‌లో పెట్టిన విద్యుత్ బిల్లు 2020ను ఉపసహరించుకోవాలని, రైతు ఉద్యమాల సందర్భంగా మృతి చెందిన అమరవీరుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రైతు ఉద్యమంలో రైతునాయకులపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలని కోరుతూ రైతాంగం ఢిల్లీకి వచ్చి శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్నారన్నారు. ఈ ప్రదర్శనపై హర్యానా రాష్ట్రం కానూరి సరిహద్దులో హర్యానా పోలీసులు సాగించిన దుర్మార్గమైన దాడిలో 24 సంవత్సరాల శుభ్ కరణ్ సింగ్ అనే రైతు ఉద్యమకారుడు తీవ్రమైన గాయాలపాలై మృతిచెందాడన్నారు. రైతు ఉద్యమం పట్ల బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గమైన వైఖరికి ఇది నిదర్శనమని విమర్శించారు. యువ రైతుమృతికి కారణమైన పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమంలో రైతులను బిజెపి ప్రభుత్వం చంపుతుంటే రాష్ట్రంలో రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి, ప్రధాన ప్రతిపక్షాలు టిడిపి, జనసేన పార్టీ రైతుల మృతి పట్ల స్పందించక పోవడం దుర్మార్గంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఈ మూడు పార్టీలు తమ వైఖరి ప్రకటించాలన్నారు. లేకపోతే వీటిని వ్యతిరేక పార్టీలుగా రైతులందరూ వ్యతిరేకించాలసిన పరిస్థితి వస్తుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిహెచ్ రాయుడు, రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు, మసూద్‌వలీ, పవన్, దిలీప్, ఇందిరమ్మ, కుళ్లాయమ్మ, నాగలక్ష్మి, ఈరమ్మ, అంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.



చిన్నచెరువుకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

# చిన్న చెరువుకు హంద్రీనీవా నీరు విడుదల

**ఉరవకొండ :** పట్టణంలోని సుంకులమ్మ కట్టకు అనుకుని ఉన్న చిన్న చెరువుకు రైతులు, వైసిపి నాయకులు గురువారం హంద్రీనీవా నీటిని విడుదల చేశారు. పశువులకు ఇతర అవసరాలకు వాడుకునేందుకు హంద్రీనీవా నీటితో చెరువు నింపాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి పాతపేట, తలారివీధికు చెందిన కొందరు రైతులు విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మాజీ ఎమ్మెల్యే గ్రామ పంచాయతీ అధికారుల సహకారంతో రైతులు, వైసిపి నేతలు మార్కెట్ యార్డు వెనుక ఉన్న హంద్రీనీవా కెనాల్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఐదు ట్రాక్టర్ల ద్వారా పంపు చేసి నీటిని చెరువుకు విడుదల చేశారు.

# ఐదారు నెలల్లో తడకలేరు బ్రిడ్జి నిర్మాణం పూర్తి

### ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

**ప్రజాశక్తి-అనంతపురం**

ఎ.నారాయణపురం పంచాయతీలో తడకలేరు వంకపై ఐదారు నెలల్లో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం నారాయణపురంలో తడకలేరు వంకపై బ్రిడ్జి నిర్మాణానికి జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మతో కలిసి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూరల్ పంచాయతీలకు పీఏబీఆర్ నీరు అందించే పనులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎ.నారాయణపురం పంచాయతీల్లో ప్రచారం చేశామన్నారు. ప్రతిచోటా రోడ్లు, డ్రెయినేజీతోపాటు తడకలేరు వంకపై బ్రిడ్జి నిర్మించాలని కోరారు. వైసీపీ అధికారంలోకి రాగానే నారాయణపురం పంచాయతీలో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టామన్నారు. ఇందులో భాగంగానే బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని, ఐదారు నెలల్లో బ్రిడ్జి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్లు కోవిడ్ కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎక్కడా సంక్షేమ పథకాలు ఆగలేదన్నారు. సిఎం జగన్ సహకారంతో అనంతపురం నియోజకవర్గంలో రూ.1045 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. గత ఎన్నికల్లో చెప్పినట్లు నారాయణపురంతోపాటు ఇందిరమ్మ కాలనీ, నాగిరెడ్డి పల్లి, ఇతర గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాం. రూ.90 కోట్లతో రూరల్ పంచాయితీల దాహార్తి తీర్చేందుకు పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నాం. రూ.43 కోట్లతో నారాయణపురం పంచాయతీ అభివృద్ధి చేశామన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ సంక్షేమంతోపాటు అభివృద్ధి చేసి చూపిస్తున్న ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తన అనుభవంతో కోట్ల నిధులతో అభివద్ధి పరుగులు పెట్టిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వరలక్ష్మి, ఎంపిటిసిలు నాగేంద్ర, శృతి, నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీదేవి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, హుస్సేన్, జగన్మోహన్‌రెడ్డి, మల్లెల వేణు, అంజలీదేవి, బి.మదన్‌మోహన్‌రెడ్డి, సత్తెన్న, మురళీమోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఉమ్మడి మనోజ్, విశ్వనాథ్‌రెడ్డి, పుల్లారెడ్డి, పురుషోత్తమరెడ్డి, రామంజినరెడ్డి, కృష్ణారెడ్డి, బషీర్, రామసుబ్బారెడ్డి, ఆంజనేయులు, దౌలా, తదితరులు పాల్గొన్నారు.



బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నాయకులు

# ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుపై దృష్టి సారించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి-అనంతపురం**

ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు పరిమితికి మించకుండా చూడాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో గురువారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఎలక్షన్ ఎక్స్పెండిచర్ మానిటరింగ్ టీం, ఎఇఒలు, అకౌంటింగ్ టీమ్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో వీడియో సర్వేలెన్స్ టీంలు (వీఎస్టీ), వీడో వీవింగ్ టీం (వివిటీ), ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్), స్టాటిక్ సర్వేలెన్స్ టీంలు (ఎస్ఎస్టీ), మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి), అసిస్టెంట్ ఎలక్షన్ అబ్జర్వర్ (ఏఈవో), ఎక్స్పెండిచర్ మానిటరింగ్ సెల్‌తో అకౌంటింగ్ టీం సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు పరిమితికి మించకుండా చూడాలన్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి రూ.95లక్షలు, అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి రూ.40 లక్షలకు మించకుండా వ్యయ ఖర్చు చేయాలన్నారు. అభ్యర్థులు అనధికారికంగా, లోపాయికారీగా చేస్తున్న వ్యయ ఖర్చు వివరాలు పర్యవేక్షిస్తూ చెప్పిన పరిమితులకు మించి ఖర్చు చేయకుండా చూడాల్సిన బాధ్యత ఎక్స్పెండిచర్ మానిటరింగ్ టీం అధికారులపై ఉందన్నారు. అభ్యర్థుల అందరి వివరాలు అధికారులతో ఉండాలని, ప్రతి అంశంపై అధికారులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. సున్నితమైన నియోజకవర్గాల్లో మరింత జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. ప్రతి ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో అకౌంట్స్ ఏర్పాటు చేయాలని, ఎన్నికల విధులపై ఎలక్షన్ ఎక్స్పెండిచర్ మానిటరింగ్ టీం ఏఈవోలు మరియు అకౌంటింగ్ అధికారులు సన్నద్ధం కావాలన్నారు. రోజూ రిపోర్టు ఎలా.. ఏ ఫార్మెట్‌లో పంపించాలి, ఆర్ఓ ఎన్ని రోజులకు ఒకసారి తనిఖీ చేస్తారు, తదితర అంశాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే నోడల్ అధికారులతో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్పెండిచర్ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఇందిర, లోకల్ ఫండ్ ఆఫీసర్ శివారెడ్డి, జిల్లా కోపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ నాగరాజు, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియాదేవి, డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, ఏఈవోలు, అకౌంటింగ్ టీమ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐ రమణకు కన్నీటి వీడ్కోలు

## నివాళులర్పించిన ఆర్థికమంత్రి బుగ్గన



ఎస్ఐ రమణకు నివాళులర్పిస్తున్న మంత్రి బుగ్గన, ఉన్నతాధికారులు

**ప్రజాశక్తి-అనంతపురం క్రైం**

తెలంగాణ రాష్ట్రంలో బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జిల్లాకు చెందిన నంద్యాల జిల్లా ఎస్ఐ సంబారి వెంకటరమణ అంత్యక్రియలు గురువారం కన్నీటి వీడ్కోలు మధ్య ముగిశాయి. నగరంలోని రామచంద్రనగర్‌కు చెందిన ఎస్ఐ ఎన్.వి.రమణ 1989లో జిల్లా పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరాడు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పని చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. ఎస్ఐగా పదోన్నతి పొందాక నందికొట్కూరు పోలీసు స్టేషన్, తర్వాత రాచర్ల ఎస్‌హెచ్‌ఓగా పని చేస్తున్నారు. సౌమ్యుడు, వివాద రహితుడు. ఈనేపథ్యంలో బుధవారం తెలంగాణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్.వి.రమణతోపాటు అల్లుడు పవన్‌సాయి, డ్రైవర్ చంద్రశేఖర్ మృతిచెందారు. దీంతో ఎస్ఐ మృతదేహాన్ని గురువారం నగరంలోని స్వగృహానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ రమణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి భార్య శ్రీవాణి, కూతురు అనూషను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఎస్పీ భరోసా కల్పించారు. అనంతరం మతదేహాన్ని గార్లదిన్నె మండలం మర్తాడు సమీపంలోని సొంత తోటకు తీసికెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిటిసి అదనపు ఎస్పీ జె.మల్లికార్జునవర్మ, డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి, పలువురు సిఐలు, ఎస్ఐలు, బ్యాచ్‌మేట్లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

**అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి బుగ్గన**

**గార్లదిన్న:** మండల పరిధిలోని మర్తాడు గ్రామంలోని సొంత వ్యవసాయి పొలంలో నిర్వహించిన అంత్యక్రియల్లో ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నంద్యాల ఎస్పీ రఘువీరారెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అనంతపురం డీఎస్పీ వెంకట శివారెడ్డి, ఎస్ఐ.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

## కలెక్టర్లకు విద్యాశాఖ కమిషనర్ల ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, డిఇఒ వరలక్ష్మి

**ప్రజాశక్తి-అనంతపురం**

జిల్లాలో ఇంటర్మీడియట్, 10వ తరగతి, డీఎస్సి, టెట్ పరీక్షల నిర్వహణ కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరబ్‌గౌర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం తాడేపల్లిలోని విద్యా శాఖ కార్యాలయం నుంచి మంత్రి బొత్స సత్యనారాయణతో కలిసి ఇంటర్మీడియట్, 10వ తరగతి, డీఎస్సి, టెట్ పరీక్షలపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించే ఇంటర్, మార్చి 18వ తేదీ నుంచి నిర్వహించే పదవ తరగతి పరీక్షల కోసం ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసి పరీక్షలను తనిఖీ చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా జరగాలని, ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్సులతో రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షలు జరిగే రోజు 100 మీటర్లలోపు ఉండే జిరాక్స్ సెంటర్లను బంద్ చేయించాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లతోపాటు ఒక నర్సును ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలను సెల్‌ఫోన్ ఫ్రీ జోన్‌గా ప్రకటించిన నేపథ్యంలో సిబ్బంది సెల్‌ఫోన్లను ఉపయోగించరాదన్నారు. పరీక్ష కేంద్రానికి వెళ్లే ముందు అమ్మాయిలను మహిళా పోలీసులు తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎం.గౌతమి, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, డివిఇఒ వెంకటరమణనాయక్, డిఇఒ వరలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ రాముడు, తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## యువకుడు ఆత్మహత్య



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వై.విఆర్

**గుత్తి :** అనారోగ్య సమస్యలతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బేతాపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిన్నలక్ష్మన్న కుమారుడు పి.నరేష్ (22) గతంలో ఎస్ఎఫ్ఐ నాయకుడుగా పనిచేశారు. ప్రస్తుతం బెంగళూరులోని ఓ పార్సిల్ సర్వీసులో పని చేస్తున్నాడు. అయితే కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. దీంతో శస్త్రచికిత్స కూడా చేయించుకున్నాడు. అయినప్పటికీ తగ్గకపోవడంతో బాధను భరించలేక స్వగ్రామానికి వచ్చి బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అతన్ని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సి.రమేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వైసీపీ సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, నాయకులు మల్లయ్యయాదవ్, కౌన్సిలర్లు ఎన్.ఫారుక్, వి.వరదరాజులు ఉన్నారు.

## చెట్టు విరిగిపడి దంపతులు మృతి

**పుట్లూరు :** చెట్టు విరిగి ద్విచక్ర వాహనంపై పడి భార్య, భర్త మృతిచెందిన ఘటన గురువారం మండల పరిధిలోని నడింపల్లి సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన వెంకటరాముడు, ఆయన భార్య నాగమణి నార్పల మండలం గూగూడు నుంచి వెల్లుట్లకు వస్తుండగా నడింపల్లి సమీపంలోకి రాగానే దారి పక్కనే ఉన్న వేపచెట్టు కొమ్మ విరిగి ద్విచక్ర వాహనంపై పడింది. దీంతో వెంకటరాముడు (45) అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన నాగమణిని మెరుగైన చికిత్సనిమిత్తం బెంగుళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది.

## అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

**అనంతపురం క్రైం :** వికలాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా, రూ.1లక్ష బాధితురాలికి పరిహారం చెల్లించాలని అనంతపురం 4వ ఎడిజె జడ్జి కోర్టు తీర్పు వెలువరించింది. వివరాల మేరకు.. కూడేరు మండలం గొట్కూరు గ్రామానికి చెందిన హనుమంతు ఓ వికలాంగురాలిపై 29-12-1019న అత్యాచారం చేశాడు. ఈమేరకు ఫిర్యాదు అందడంతో అప్పటి ఎస్ఐ యువరాజు కేసు నమోదు చేశారు. దీనిపై సిఐ కృష్ణారెడ్డి సమగ్రంగా దర్యాప్తు చేపట్టి కోర్టుకు నివేదిక సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించిన జడ్జి శోభారాణి నిందితుడు హనుమంతుకు ఐదేళ్ల జైలు, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. దర్యాప్తు అధికారి కృష్ణారెడ్డి, యువరాజు, ఎపిపి సుజన, కోర్టు ఏఎస్ఐ ఓబుళపతిని ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ అభినందించారు.

## ఆముదం పంటకు నిప్పు

**బెలుగుప్ప :** ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకోవడంతో ఆముదం పంటతోపాటు డ్రిప్పు, వైరు వంటి పరికరాలు ఆహుతైన ఘటన గురువారం మండల పరిధిలోని ఆవులెన్న గ్రామానికి చెందిన రైతు ఉప్పర తిప్పేస్వామి తోటలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ తనకున్న ఏడెకరాలు వ్యవసాయ తోటలో ఆముదం పంట సాగు చేశాడు. సాయంత్రం ప్రమాదవశాస్తూ నిప్పంటుకోవడంతో పంటకు నీరు అందించే డ్రిప్పు వైర్లు కాలి బూడిదయ్యాయి. వెంటనే కళ్యాణదుర్గం ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో ఫైరింజన్ రావడంతో అప్పటికే ఆముదం పంట డ్రిప్ వైర్లు పరికరాలు పూర్తిగా కాళీ బూడిదయాయని వాపోయాడు. ఫలితంగా దాదాపు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలన్నారు.

# నగరానికి దీటుగా పంచాయతీల అభివృద్ధి

## ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



వృద్ధుడికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురం నగరానికి ధీటుగా రాజీవ్‌కాలనీ, నారాయణపురం, రూరల్, రుద్రంపేట పంచాయతీలను అభివృద్ధి చేశామనిఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని రాజీవ్‌కాలనీలో 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు పంచాయతీల్లో ఏకంగా రూ.85 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేశామన్నారు. ఒక్క రాజీవ్ కాలనీ పంచాయతీలోనే రూ.16 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. అలాగే రాజీవ్ కాలనీ, నారాయణపురం, రుద్రంపేటకు పీఏబీఆర్ నీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నగరానికి తాగునీటి సరఫరా విషయంలో మోటార్లు కాలిపోవడం వల్ల నీటి సమస్య వచ్చిందన్నారు. అయితే మోటర్ బిగించామని, పది రోజుల్లో సమస్య తీరుతుందన్నారు. ఇందుకు కార్పొరేషన్ పాలకవర్గం, మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. నగరాన్ని మరింత అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతోనే ఐఎఎస్ అధికారిని కమిషనర్‌గా తీసుకొచ్చామన్నారు. వీటిని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. వీటిని రానున్న ఎన్నికల్లో ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు 'సిద్ధం'

## ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

**ప్రజాశక్తి-బెలుగుప్ప**

త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రామసాగరం గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఎమ్మెల్యేకు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రామసాగరం టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నారసింహుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్**

మండల పరిధిలోని మల్లాపురం సమీపంలో వెలసిన విప్లమలై లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహణ ంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భ ంగా ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం క్షేత్ర మూలవిరాట్, పరివార దేవతా సహిత పంచామృ తాభిషేకం, భాగవత వాసుదేవ పుణ్యాహం, రక్షాబం ధన్ అంకురార్పణ, కలశస్థాపన ఆరాధన, ధోజారోహ ణభేరి, తాడన మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగంగావించారు. బళ్లారి తాటికొండ కుమార్ స్వామి కుటుంబ సభ్యులతో పూజలు, నిత్యారాధన విశ్వక్సేన, వాస్తు హోమాలు, నిత్య బలిహారణ సాయ ం, సేవారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారి నరసింహులు, ఉప కోశాధికారి సత్యనారాయణ, కార్యదర్శి గురు రాఘవేంద్ర ప్రసాద్, అకౌంటెంట్ వెంకటేశులు, సభ్యులు గురునాథ్‌రెడ్డి, కమలాక్షుడు, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఫొటోగ్రాఫర్ శ్రీకష్ణపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-పుట్లూరు**

రాప్తాడులో సిఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్ శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి శిక్షించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుపై దాడిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి మాట్లాడుతూ బహిరంగ సభను కవర్ చేయడానికి వెళ్లిన ఫొటోగ్రాఫర్‌ను విచక్షణా రహితంగా దాడి చేయడం బాధాకరమన్నారు. రాజకీయం పార్టీలు తమ రాజకీయ వైరుధ్యాలు ఉంటే పార్టీతో పోరాడలేని తప్పు, ఇలా విలేకరులపై దాడులు చేయడం మంచిది కాదన్నారు. వెంటనే ఎస్పీ స్పందించి దాడి చేసిన వారిని శిక్షించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.వెంకటచౌదరి, టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, కె.నాగభూషణ్, కుళ్లాయప్ప, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# వైసిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులుగా వైపి.బాబు



**గుత్తి :** వైసిపి క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులుగా గుత్తికి చెందిన వై.ప్రసాద్‌బాబు నియమితులయ్యారు. ఈమేరకు వైసిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మేడిది జాన్సన్ నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ అభివద్ధి కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని వైపి.బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తి పాస్టర్లు వాసు అనిల్‌కాంత్, జాకబ్, అబ్రహం, సాలోమోన్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# వాల్మీకుల గౌరవాన్ని పెంచా : మాజీమంత్రి కాలవ




పార్టీలోకి చేరిన వారితో మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పాతికేళ్లుగా క్రియాశీల రాజకీయాల్లో అవినీతి మరక లేకుండా బతుకుతూ వాల్మీకుల గౌరవాన్ని ఇనుమడింపజేశానని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు నాయకుల మలకన్న ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని 3, 4, 6, 31, 32 వార్డులకు చెందిన వంద వాల్మీకి కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శిగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా తమ అధినేత చంద్రబాబు అవకాశాలు కల్పించారన్నారు. వాల్మీకుల్లో తొలిసారి మంత్రిగా పనిచేసే అవకాశం తనకే దక్కిందన్నారు. ఇన్ని పదవులు పొందినా ఎక్కడా వివాదాల్లోకి వెళ్లకుండా, అవినీతి ఆరోపణల్లేకుండా నిష్టతో రాజకీయాలు సాగిస్తున్నానన్నారు. తనవల్ల వాల్మీకులకు గుర్తింపు, గౌరవం పెరిగాయన్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తట్టుకుని నిలబడగలిగానని, చంద్రబాబు ఆశీస్సులతో మరిన్ని గొప్పకార్యాలు సాధిస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. 60ఏళ్ల వాల్మీకుల ఎస్టీ హోదా సాధన కలను నిజం చేసేందుకు తాను మంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యేక శ్రద్ధ చూపానన్నారు. శాసనసభలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపామని, భవిష్యత్తులో దానిని తప్పక సాధిస్తామన్నారు. అంతేగాకుండా తన హయాంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని వివరించారు. సుమారు రూ.4500కోట్ల నిధులు మంజూరు చేయించానని, అయితే అవన్నీ ప్రస్తుతం చాలా పనులు అసంపూర్తిగా ఆగిపోయాయన్నారు. ఈసారి ఎన్నికల్లో తనను 50వేల మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ వెంకటేషులు, శంకర్, నాగరాజు, అంజి, సిద్ధన్న, శ్రీరాములు, శ్రీనివాసులు, నాగయ్య, వేణు, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా సంక్షేమ పథకాలు

## ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి



ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న వైసిపి నాయకులు

**ప్రజాశక్తి-పుట్లూరు**

కుల, మత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు అన్నారు. గురువారం పుట్లూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో 4వ విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆసరా ద్వారా రూ.4.50 కోట్లు నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. నాలుగు విడతల్లో 588 సంఘాలకు దాదాపు రూ.18 కోట్ల లబ్ధిని చేకూర్చినట్లు వివరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం జగన్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. చంద్రబాబు డ్వాక్రా మహిళలు, ప్రజలను మోసం చేస్తే జగనన్న అండగా నిలిచారన్నారు. మోసపూరిత హామీలతో మళ్లీ ప్రజల్లోకి వస్తున్న చంద్రబాబుని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. పేదల జీవితాలు బాగుండాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతూ మెరుపైన విద్యను అందిస్తున్నారన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు.

**సంక్షేమ పథకాల అమలులో వాలంటీర్లు కీలకం**

జగనన్న ప్రభుత్వంలో వాలంటీర్లు కీలకంగా పని చేస్తూ ప్రజలకు అండగా నిలిచారని సాంబశివారెడ్డి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో ఏ ఒక్క సంక్షేమ పథకంలోనూ అవినీతికి తావివ్వకుండా ప్రజలకు అందించారన్నారు. అవినీతి రహిత పాలన అందించినందుకు, వచ్చే ఎన్నికల్లో ధైర్యంగా ఓటు అడిగే హక్కు మన పార్టీకి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ సునీత, ఎంపిడిఒ దస్తగిరి, ఎపిఎం వెంకట్రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, మహిళా సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు, ప్రభుత్వానికి వారధులు వాలంటీర్లు



వాలంటీర్లకు సేవా పతకాలను అందజేస్తున్న నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, నాయకులు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

ప్రభుత్వ, ప్రజల మధ్య వారధుల్లా వాలంటీర్లు పని చేస్తూ విశేష సేవలు అందిస్తున్నారని రాయదుర్గం మున్సిపల్ అధ్యక్షురాలు పొరాళు శిల్ప కొనియాడారు. గురువారం పట్టణంలోని 2, 7 సచివాలయం (పాత మీసేవ) వద్ద వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క వాలంటీర్ సిఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విధిగా ప్రజలకు చేరవేస్తున్నారన్నారు. ముఖ్యంగా నవరత్నాల పథకాలు, పరిపాలన సంస్కరణలను వివక్ష లేకుండా ప్రతి పేదవాడికి చేరవేసే బాధ్యత తీసుకున్నారన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్‌మాలిక్, వైసిపి రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, వైస్ ఛైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, వైసిపి పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, వార్డు సభ్యులు, వార్డు ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రాయదుర్గం రూరల్ :** ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా వాలంటీర్లు సేవలందిస్తున్నారని వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి కొనియాడారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వాలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను క్లస్టర్ పరిధిలో ఉన్న ప్రజలకు వివరించి జగనన్నకు మద్దతు తెలిపేలా వాలంటీర్లు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి మల్లికార్జున, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## దళితుల ఇళ్లస్థలాలు కాపాడాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**అనంతపురం కలెక్టరేట్ :** కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 2010లో కరుకుంట గ్రామం 41-1, 41-1, 41-3 సర్వేనెంబర్‌లో దళితులకు ఇళ్ల స్థలాలు పట్టాలు మంజూరు చేశారు. ఇప్పుడు కొందరూ రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆ స్థలాలను కబ్జా చేస్తున్నారు. వారి నుంచి ఆ భూమిని కాపాడి పేద దళితులకు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటి ఛైర్మన్ బిసిఆర్.దాస్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పట్లో తహశీల్దార్‌గా ఉన్న రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఇచ్చిన 14 రోజులకే పట్టాలు రద్దు చేసినట్లు తెలిసి రెవెన్యూ అధికారులను అప్పట్లో కలిసి విన్నవించామన్నారు. హైకోర్టులో పిటిషన్ వేశామన్నారు. విచారించిన ధర్మాసనం దళితులకే ఆ స్థలాలు కేటాయించాలని తీర్పు ఇచ్చిందన్నారు. అడ్వకేట్ జనరల్ కూడా ఆ స్థలాలు ప్రభుత్వానికి తీసుకునే ఉద్దేశం లేదని కూడా చెప్పిఉన్నారని గుర్తు చేశారు. ఇప్పుడు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై స్థలాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. తక్షణమే పరిశీలించి దళితుల భూములు కాపాడి పేదలకే అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ప్రజాశక్తి-నార్పల**

మండల పరిధిలోని దుగుమర్రి, నర్సాపురం, బొందలవాడ, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపిడిఒ రాముడు, సెక్టోరియల్ ఆఫీసర్ ఉమాదేవి గురువారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆయా కేంద్రాల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత దుగుమర్రి, బొందలవాడ గ్రామ సచివాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు.

**మధ్యాహ్న భోజన ఏజెన్సీపై ఆగ్రహం**

దుగుమర్రి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంపిడిఒ రాముడు గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యవంతంగా లేకపోవడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనాన్ని మీరు పరిశీలిస్తున్నారా.. లేదా.. అంటూ ప్రధానోపాధ్యాయుడుపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే ఏజెన్సీపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ రంజిత్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## కారుణ్య నియామకం

**అనంతపురం కార్పొరేషన్ :** మున్సిపల్ కార్పొరేషన్‌లోని మెప్మా విభాగంలో విధులు నిర్వహిస్తూ మృతిచెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి దస్తగిరి కుటుంబానికి మేయర్ మహమ్మద్ వసీం గురువారం కారుణ్య నియామకపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు నాగరాజు, ఇంజనీరింగ్ వర్కర్స్ నాయకులు సంజీవరాయుడు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రంగనాథస్వామి ఉత్సవాలు

**బెలుగుప్ప :** మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలో వెలిసిన రంగనాథ స్వామి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈమేరకు రెండు రోజులపాటు నిర్వహించినున్న ఉత్సవాకు దేవాదాయ శాఖ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు ఉదయం సుప్రభాత సేవ, గణపతి పుణ్యం, నాంది, ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం మూడు గంటలకు గణపతి, నవగ్రహ పూజ, హోమాలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం తెల్లవారుజామున శ్రీదేవి భూదేవి రంగనాథ స్వామి కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.


## ప్రపంచ స్కౌట్స్, గైడ్స్ దినోత్సవం

**కుందుర్పి :** ప్రపంచ స్కౌట్స్, గైడ్స్ దినోత్సవాన్ని మండల పరిధిలోని యర్రగుంట ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పతాకావిష్కరణ చేసి సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి బొమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు మానసిక, ఆరోగ్యపరంగా, మేథాశక్తి కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల ప్రతిభ విలువ తీసేందుకే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్ షహీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

## పుస్తకాల వితరణ

**బెలుగుప్ప :** మండల పరిధిలోని నక్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎన్నారై వాసవీ సంఘం వారు పాఠశాలకు 24000 విలువజేసే గ్రంథాలయ పుస్తకాలను గురువారం వితరణ చేశారు. ఇందులో భాగంగా పాఠశాల సిబ్బంది ఎన్నారై మహేష్ తల్లి భాగ్యలక్ష్మిని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నక్కలపల్లి గ్రామంలో చదివి మిలిటరీలో చేరిన వారి తల్లిదండ్రులకు నక్కలపల్లి ఆంజనేయ కూతురు ఎన్నారై సుజాత తరపున 15 మందికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఇఒ మల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సర్పంచి రామిరెడ్డి, పాఠశాల ఛైర్మన్ వీరారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'ఉయ్యాలవాడ' చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి



ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

**అనంతపురం :** దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల గురించి బావి తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కావున నరసింహారెడ్డిని చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు పాటిల్ రామకృష్ణారెడ్డి, గట్టిరెడ్డి బయపరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హనుమంతురెడ్డి, రాజశేఖరరెడ్డి, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.